సాక్షి చిత్తూరు
శనివారం। 12। ఆగస్టు। 2023



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని మంత్రులు ఉషశ్రీ చరణ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. - 10లో



వ్యాధులను కట్టడి చేద్దాం
దోమలను అరికట్టి, వ్యాధులను కట్టడి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. - 10లో



	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	24
తిరుపతి	36	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్

బడి బస్సులపై ప్రత్యేక డ్రైవ్



చిత్తూరులో బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

చిత్తూరు రూరల్: డీటీసీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల బడి బస్సులపై శుక్రవారం ఎంవీఐలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వాహనలా కండిషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రెన్యూవల్ చేయని వాహనాలకు జరిమానా విధించారు. నిర్వహణపై సూచనలు చేశారు. ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, గాయత్రి తదితరులు తనిఖీలు చేసిన వారిలో ఉన్నారు.

16న జాబ్ మేళా

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ(ఐటీఐ)లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐటీఐలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీసీఎల్, ఎకార్త్‌లెజిస్టిక్ వంటి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పాసైన వారు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు 8142509017నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఎంపీడీవో మోహన్‌మురళీ, ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు

బోయకొండలో శ్రావణ పూజలు



చౌడేపల్లి: ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో అధిక శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలను నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 10–30 నుంచి 12గంటల నడుమ రాహుకాల సమయంలో వేద మంత్రోచ్చారణల నడుమ అర్చనలు,అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అభిషేక పూజల్లో 86 మంది జంటలు పాల్గొన్నాయి. వీరికి ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలు అందజేశారు.

వినాయకుని సేవలో ఎస్పీ రిశాంత్ రెడ్డి



కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా, స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలను చైర్మన్, ఈఓ అందించారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 3 సర్పంచ్, 46 వార్డు సభ్యుల స్థానాల ఎన్నికల కోసం దాఖలైన 87 నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. నెల్లేపల్లె సర్పంచ్ స్థానానికి దాఖలైన 4 నామినేషన్లలలో 2, కాళికాపురం స్థానానికి దాఖలైన ఒక నామినేషన్ సక్రమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కత్తెరపల్లె సర్పంచ్ స్థానానికి దాఖలైన 5 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు. 46 వార్డు సభ్యుల స్థానాలకు 77 నామినేషన్ దాఖలుకాగా, అందులో 65 అర్హత సాధించాయని తెలిపారు. శనివారం తిరస్కరణకు అవకాశం, 13న తిరస్కరణ పరిశీలన, 14న ఉపసంహరణ, అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుందన్నారు.

ఎన్నికల ఆర్‌ఓల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : పార్లమెంట్ నియోజకవర్గాల ఆర్‌ఓలను నియమిస్తూ భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు ఆర్‌ఓగా కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి ఆర్‌వోగా తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డిని నియమించారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఆజాదీకా అమృతోత్సవాల్లో భాగంగా జిల్లాలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. పోస్టాఫీసుల్లో రూ.25కు జాతీయ జెండాలు అందుబాటులో ఉంటాయన్నారు.

అమ్మకు అవరోధం



▸▸ తిరుపతి ఎమ్మార్‌పల్లెకు చెందిన కోమల అనే మహిళకు 36ఏళ్లు. ఇంతవరకు సంతానం కలగలేదు. టీవీలో ప్రకటనలు చూసి రెండేళ్ల క్రితం చెన్నైలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. రూ.30 వేలు చెల్లించి భార్యాభర్తలు అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వారి ఫలితాలను పరిశీలించి గర్భధారణ కలగాలంటే ఫీజుగా రూ.5 లక్షలు అడిగారు. ఆ దంపతులు ఖర్చుకు వెనకాడకుండా అడిగినంతా ముట్టజెప్పారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో నిరాశగా ఇంటి ముఖం పట్టారు.

▸▸ చిత్తూరు మండలానికి చెందిన సుమన ప్రియ (28)కు 9ఏళ్ల క్రితం వివాహమైంది. కానీ సంతానం కలగలేదు. తీరా ఆస్పత్రిలో పరీక్షిస్తే.. పీసీఓడీ ఉందని డాక్టర్లు నిర్ధారించారు. అయితే ఆమె ఓ నాటు వైద్యుడిని ఆశ్రయించారు. ఆరు నెలల పాటు ఆకు మందు తీసుకున్నారు. ఇందుకోసం ప్రతి నెల రూ. 2వేలు చెల్లించారు. అయినప్పటికీ గర్భం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

▸▸ చిత్తూరు నగరం తోటపాళ్యానికి చెందిన దంపతులకు పిల్లలు లేరు. వివాహమై రెండేళ్లు గడుస్తున్నా గర్భం దాల్చకపోవడంతో జిల్లా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు పీసీఓడీ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో 8నెలల పాటు ఆమెను పర్యవేక్షణలో ఉంచారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మందులు వాడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. 10వ నెలలో ఆమె గర్భం దాల్చింది. ప్రస్తుతం పండంటి బిడ్డకు జన్మనిచ్చింది.

ఉమ్మడి జిల్లా సమాచారం

టీచింగ్ ఆస్పత్రులు	సీహెచ్‌సీలు	ప్రైవేట్ హాస్పిటళ్లు సుమారు
02	15	3వేలు
జిల్లా ఆస్పత్రి 01	పీహెచ్‌సీలు 108	
ఏరియా వైద్యశాలలు 07		

మాతృత్వం.. మహిళలకు దేవుడిచ్చిన వరం. మరోజీవికి ప్రాణం పోసే అపూర్వమైన అవకాశం. అయితే హార్మోన్ల అసమతుల్యత కారణంగా పలువురు స్త్రీలు ఈ అపురూప భాగ్యానికి దూరమవుతున్నారు. పీసీఓడీ (నీటి బుడగలు) సమస్యలతో నెలసరి గాడి తప్పి గర్భధారణకు నోచుకోలేకపోతున్నారు. అమ్మా అనే పిలుపు కోసం అలమటిస్తున్నారు. పల్లెసీమల్లో కంటే పట్టణప్రాంతాల్లోనే బాధితులు పెరుగుతున్నారు. ఈ క్రమంలో పిల్లలపై ప్రేమను చంపుకోలేక నిత్యం వందల మంది ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రూ.లక్షల్లో ఫీజు ముట్టజెప్పి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. నెలల తరబడి చికిత్సలు పొందుతున్నారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. మందులను క్రమం తప్పకుండా వాడడంతోపాటు ఆరోగ్య జాగ్రత్తలను పాటిస్తే ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వాస్పత్రుల్లోనే వైద్యం పొందే వెసులుబాటు ఉందని వెల్లడిస్తున్నారు.

- మహిళల్లో అధికమవుతున్న పీసీఓడీ సమస్య
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో నమోదవుతున్న కేసులు
- పల్లెల కంటే పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న బాధితులు
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు రూ.లక్షల్లో ఫీజులు
- ఆరోగ్య జాగ్రత్తలే శ్రీరామరక్ష అంటున్న వైద్యులు



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మహిళలకు వైద్య పరీక్షలు (ఫైల్)

సాక్షి, తిరుపతి డెస్క్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు మహిళలు పీసీఓడీ (పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) అంటే 'నీటి బుడగల' సమస్యతో బాధపడుతున్నారు. నిత్యం దాదాపు 120 నుంచి 150 మంది వరకు పీసీఓడీ చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లోని స్త్రీలే ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

పీసీఓడీ ఎందుకొస్తుందంటే...

ప్రతి స్త్రీలోనూ రుతు క్రమం వచ్చినప్పుడు అండాశయంలో అండం పరిపక్వత చెంది విడుదల అవుతుంది. నెలసరి తర్వాత 11–18 రోజుల మధ్యకాలంలో అండం విడుదల ప్రక్రియ జరుగుతుంది. ఇందుకు ఈస్ట్రోజన్ హార్మోన్ అవసరమవుతుంది. ఈ హార్మోన్ లోపం తలెత్తినప్పుడు క్రమంగా పీసీఓడీకి దారితీస్తుంది. ఈ సమస్యతో బాధపడే వారిలో విడుదలయ్యే అండం పూర్తిగా ఎదగక, అది అండాశయంలో నీటి బుడగ రూపంలో ఉండిపోతుంది. అలాగే జీవనశైలిలో వచ్చిన మార్పులు, నిద్రలేమి, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, ఎత్తుకు తగ్గ బరువు ఉండకపోవడం, పని ఒత్తిడి, బయట తిండికి అలవాటు పడడం వంటి కారణాలతో కూడా పీసీఓడీ బారినపడుతుంటారని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే...

జీవనశైలిలోని మార్పులు కూడా పీసీఓడీకి కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఫాస్ట్‌పుడ్‌లు అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ప్రొటీన్లు, విటమిన్లు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. విటమిన్ –బి లోపం రాకుండా చేపలు, గుడ్లు, ఆకుకూరలు, క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇలాచేస్తే నెలసరి క్రమంగా వచ్చి సమస్య నుంచి బయటపడుతారు. దీనికి తగట్టు వ్యాయామం అవసరం.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గర్భస్థ సమస్యల ఓపీ వివరాలు


నెల	ఓపీ సంఖ్య
ఫిబ్రవరి	5,589
మార్చి	6,286
ఏప్రిల్	7,219
మే	7,114
జూన్	8,082
జూలై	8,547

ఫీజులు గుంజేస్తున్నారు

గతంలో పిల్లలు పుట్టకుంటే వ్రతాలు, నోములు నోచేవాళ్లు. దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ప్రస్తుతం కార్పొరేట్ మాయాజాలంలో పలువురు దంపతులు కొట్టుకుపోతున్నారు. మాతృత్వం పొందేందుకు రూ.లక్షల్లో ఫీజులు ముట్టజెబుతున్నారు. పీసీఓడీ సమస్యతో బాధపడేవారిని కార్పొరేట్ ఆస్పత్రుల వారు సైతం యథేచ్ఛగా దోచుకుంటున్నారు. దంపతుల బలహీనతను అడ్డుపెట్టుకుని రూ.3 నుంచి రూ.10లక్షల వరకు ఫీజులు గుంజేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి వంటి నగరాల్లో సైతం రూ.లక్షలు వసూలు చేసేస్తున్నారు. మరికొందరు నాటువైద్యం అంటూ అనారోగ్య సమస్యలను తెచ్చుకుంటున్నారు. పీసీఓడీ నివారణకు ప్రభుత్వాస్పత్రిలోనే పూర్తి స్థాయిలో సేవలు ఉన్నాయని వైద్యులు గుర్తు చేస్తున్నారు.

లక్షణాలు

- నెలసరి సక్రమంగా రాదు
- ఎక్కువగా బ్లీడింగ్, రుతుక్రమం సమయంలో కడుపు నొప్పి ఉంటుంది
- అధిక బరువు, అకారణంగా జుట్టు రాలడం
- నెలసరి రాకపోవడంతో ముఖం, కాళ్ల మీద అవాంఛిత రోమాలు పుట్టుకొస్తాయి. బరువు పెరిగిపోతారు.
- శరీరంలో ఇన్సులిన్ నిరోధకత కూడా పెరిగిపోతుంది.



పరీక్షలు..

పీసీఓడీని నిర్ధారించడానికి గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలి. వారి సూచనల మేరకు హార్మోన్ల స్థాయిని లెక్కించడానికి రక్త పరీక్షలు చేస్తారు. అండాశయం, గర్భాశయం రూపాన్ని తెలుసుకోవడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసి నిర్ధారిస్తారు.

వ్యాధులు ఇలా..

- ఎండోమెట్రియల్ క్యాన్సర్
- కొలెస్ట్రాల్ పెరుగుదల
- అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు
- గర్భస్రావాలు, సంతాన లేమి
- మధుమేహం
- మానసిక జబ్బులు
- అసాధారణ గర్భాశయ రక్తస్రావం
- క్రమ రహిత రుతుక్రమం

బెంగపడొద్దు.. దత్తత ఉందిగా..

పిల్లలు లేరనే బాధతో ఎక్కువగా మహిళలు కుమిలిపోతుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు ఏమనుకుంటారో అని దిగులు చెందుతుంటారు. అలాంటి వారికి దత్తత చక్కటి వరమంటున్నారు అధికారులు. ఐసీడీఎస్ నిర్వహించే శిశు విహార్‌ల ద్వారా దత్తత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్యులను సంప్రదించాలి



మహిళలను ఇటీవల కాలంలో ఎక్కువగా ఇబ్బంది పెడుతున్న సమస్య పీసీఓడీ. దీని బారిన పడితే నెలసరి తప్పడం, అవాంఛిత రోమాలు రావడం ఉంటుంది. గర్భధారణ కూడా ఇబ్బందికరంగా మారుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వంశపారంపర్యంగా వస్తున్న సమస్యలతో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. గర్భధారణకు చికిత్స పేరుతో మోసపోకండి. నాటు మందుల జోలికి వెళ్లొద్దు. సంబంధిత డాక్టర్లను సంప్రదించడం ఉత్తమం. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

– డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

నిర్లక్ష్యం చేస్తే సమస్యలు



పీసీఓడీ అనేది 14–45 ఏళ్ల లోపు ఉన్న మహిళల్లో అధికంగా వస్తోంది. ఈ మధ్య కాలంలో పీసీఓడీ కేసులు పెరిగాయి. చాలా మందికి పని ఒత్తిడి, టీవీలు, మొబైల్ ఫోన్లు గంటల తరబడి చూడడం. పిజ్జాలు, బర్గర్లు తినడం. బరువు పెరగడం కారణంగా పీసీఓడీ సమస్య తలెత్తుతోంది. లక్షణాలు బట్టి లేదా..వివాహమై ఏడాది గడిచినా గర్భధారణ జరగకుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం వహిస్తే సమస్యలు తప్పవు.

– డాక్టర్ ఉషశ్రీ, గైనకాలజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి

మాజీ సైనికులకు త్వరలో ఇంటి స్థలాలు

- సైనికుల సంక్షేమానికి కృషి
- ఘనంగా అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ
- పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ



అమరజవాన్ స్థూపం ఆవిష్కరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనికులు, కుటుంబసభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : దేశ సేవలో ప్రాణాలు అర్పించిన అమరువీరులు ఎంతో మంది జిల్లాలో ఉన్నారని, వారి సేవలు శ్లాఘనీయమని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సైనిక సంక్షేమ శాఖ, మాజీ సైనిక సంక్షేమ శాఖ సభ్యులు ఇచ్చిన విన్నపం మేరకు త్వరలో సైనికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్‌కు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తిరుత్తణి బస్టాండు వద్ద అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిత్తూరులో అమరవీరుల సేవలకు గుర్తుగా స్మారక స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సైనికులు, మాజీ సైనికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. సైనికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మృతి చెందిన 23 మంది అమర జవాన్‌లను సేవలను గుర్తుచేసుకుంటూ స్థూపం వద్ద ఏటా నాలుగు రోజులు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఏడు వేల మంది సైనికులు ఆర్మీలో పనిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ఎస్. షణ్మోహన్ మాట్లాడుతూ మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎస్పీ రిశాంత్ రెడ్డి మాట్లాడుతూ సైనికులు, మాజీ సైనికుల సమస్యలను పోలీసు శాఖ తరుపున పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. సైనిక సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు సైనికులు విధి నిర్వహణలో అసువులు బాశారని తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి ఒక్కో కుటుంబానికి రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్ షర్మిల, సైనిక సంక్షేమ శాఖాధికారి విజయశంకర్‌రెడ్డి, మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు పళని, సిద్ధయ్య, వరదరాజులు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌తో ఆస్తులకు చట్టభద్రత



జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: ఆస్తులను కాపాడుకోవాలంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తద్వారా చట్టభద్రత వస్తుందని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వినియోగదారులు, స్టాంప్ వెండర్స్, డ్యాకుమెంట్‌రైటర్స్, రియల్టర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆస్తిని కొనుగోలు చేసే ముందు వాటిపై జరిగిన లావాదేవీలను ఈసీ తీసుకుని పరిశీలించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ రహంతుల్లా, ఎస్‌ఎ ప్రదీప్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పక్కన డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): బీసీల అభివృద్ధిని జీర్ణించుకోలేని నేత చంద్రబాబు అయితే, బీసీలకు ఆర్థికంగా, రాజకీయంగా సముస్థానం కల్పించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరాధ్య దైవంగా నిలిచారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం పెనుమూరు మండలం మల్లిరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఉన్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో విలేకరుల స మావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందితే చంద్రబాబు ఓర్వలేరని అందుకు తానే నిదర్శమని తెలిపారు. గతంలో టీడీపీలో పని చేసినప్పుడు స్వయంగా తాను చంద్రబాబు వైఖరిని కళ్లారా చూశానన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే డిప్యూటీ సీఎం నారాయణస్వామి చిత్తూరు జిల్లాలో ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు.

పవన్ నాయకుడేనా..?

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ ప్రతి నెలా సంక్షేమం పేరుతో పేదలకు వరాల జల్లు కురిపిస్తున్న సీఎం జగనన్నను విమర్శించే స్థాయి జనసేన నేత పవన్ కల్యాణ్‌కు లేదని మండిపడ్డారు. జగన్ నాయకుడే కాదంటున్నారని, అయితే పవన్ కల్యాణ్ ఎవరు..? నాయకుడా..లేదా జులాయినా..? అని ప్రశ్నించారు. కొత్తపార్టీ పెట్టి రెండు చోట్ల పోటీ చేసి చిత్తుగా ఓటమి పాలైన పవన్ కల్యాణ్ కూడా ముఖ్యమంత్రిని విమర్శించడమా అని ఎద్దేవ చేశారు. దొంగలు దొంగలు ఊ ర్లు పంచుకున్నట్లు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ ఓట్లకోసం భిక్షమెత్తుకుంటు న్నారని విమర్శించారు. క్యాలెండర్ వారీగా సంక్షేమాలు అందించి పండుగ వాతావరణాన్ని తీసుకొస్తున్న జగనన్నను లబ్ధిదారు లు మరిచి పోరని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన బంగాళాఖాతంలో కలిసి పోవడం ఖాయమని జోస్యం చెప్పారు.

రోగులకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్

పెనుమూరు(కార్వేటినగరం) : వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ (జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి) డాక్టర్ బీసీకే నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మందుల నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పాము, కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ గీతాకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన

- నాల్గవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ జమ
- కలెక్టరేట్‌లో ఘనంగా జిల్లా స్థాయి కార్యక్రమం
- మెగా చెక్కును అందజేసిన ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రులు ఉషశ్రీ చరణ్, పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, కలెక్టర్


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

చిత్తూరు కలెక్టరేట్ : అక్క చెల్లెమ్మలను రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో ఆర్థికంగా ఆదుకుంటోందని ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నాల్గవ విడత సున్నావడ్డీ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుంచి ప్రారంభించారు. ఇదే సమయంలో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ పొదుపు సంఘాల కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సున్నా వడ్డీ పథకం పొదుపు సంఘాలకు ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. మహిళలు తమ రుణాలపై చెల్లించాల్సిన వడ్డీ డబ్బులను ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోందన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో నాల్గవ విడత పథకంలో 34,286 మహిళా సంఘాలలో ఉన్న 4,39,958 మంది మహిళలకు రూ.50.34 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోందని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సున్నా వడ్డీ మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు, పలమనేరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ, నగర మేయర్ అముద, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డీఆర్డీఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, బ్యాంక్ మేనేజర్ హరీష్, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

పెనుమూరు(కార్వేటినగరం): డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండలంలోని నాలుగో విడత సున్నా వడ్డీ పంపిణీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రితో పాటు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగనన్న చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు


జోడిచింతల వద్ద రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్

యాదమరి: మండలం మీదుగా వెళ్తున్న అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి శుక్రవారం పూజలు చేసి పనులు ప్రారంభించారు. మండలంలోని జోడిచింతల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రహదారి గుంతలమయం కావడంతో పలువురి విజ్ఞప్తి వారు స్పందించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడి మొదట మరమ్మతులకు రూ.50లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో గుంతల పూడ్చివేత పనులు, అనంతరం రూ.15 కోట్లతో తారు రోడ్డు వేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ బాబు, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, నాయకులు మనోహర్ రెడ్డి, పరంధామ గౌడ్, సురేంద్ర రెడ్డి, పెరుమాళ్, దుర్వాసులు, మురళి, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్, ఎస్ఐ సుమన్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ ఆదికేశవులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఇంచార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లాలో 122 మంది రైతులకు రూ.1.10 కోట్ల బిందు, తుంపర్ల సేద్య పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యానవనశాఖ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతుల అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు పొందేందుకు రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ. 71.45 కోట్లతో 6681 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహణపై సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, సమన్వయంతో పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన వివిధ శాఖల ఉద్యోగుల ప్రశంసా పత్రాల వివరాలను అందజేయాలన్నారు. ఆర్డీఓ, రేణుక, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరుత మృతి కేసులో నలుగురి అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు


రామకుప్పం : విద్యుత్ ఉచ్చుతో చిరుత పులి మరణానికి కారణమైన కేసులో నలుగురు నిందితులను అటవీశాఖ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. దీనిపై స్థానిక రేంజ్ అధికారి వైసీ రెడ్డి కథనం మేరకు వివరాలు.. మండలంలోని నారాయణపురం ఫారెస్ట్ బీట్‌లో వన్యప్రాణుల వేట కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చులో చిక్కుకుని గత నెల 25న చిరుత పులి మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసిన అటవీశాఖ అధికారులు మొత్తం ఆరుగురిని నిందితులుగా గుర్తించారు. వీరిలో నల్లరాళ్లచేనుకు చెందిన శరవణన్, పూలచేన్లుకు చెందిన తిరుపతి, వీర్నమలకు చెందిన కాశిరాజు, పోడుచేన్లుకు చెందిన సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.

మందులతో కుష్ఠు వ్యాధి నయం


సర్వేను పరిశీలిస్తున్న వెంకట ప్రసాద్

యాదమరి: ఆరు నెలల పాటు మందులు వాడితే కుష్ఠు వ్యాధి నయం అవుతుందని జిల్లా కుష్ఠువ్యాధి నివారణాధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులచే సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనుమానం ఉన్న 50 మందిని గుర్తించి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ లక్షణాలపై అనుమానం ఉన్న వ్యక్తులకు వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ సొత్తు స్వాధీనం నిందితుడు అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మద్దయ్య ఆచారి

చిత్తూరు అర్బన్: చిత్తూరు కన్నయ్యనాయుడు కాలనీలో రెండు రోజుల కిందట ఓ వృద్ధురాలి ఇంట్లో జరిగిన దోపిడీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వివరాలను టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి వివరించారు. కన్నయ్యనాయుడు కాలనీకి చెందిన సరోజమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 9వ తేదీన రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఆమెను కత్తితో బెదిరించి నాలుగు బంగారు గాజులను లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసుల విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కన్నయ్యనాయుడు కాలనీకే చెందిన బి.మస్తాన్‌బాబు (35) నిందితుడిగా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి రూ.2.4 లక్షలు విలువచేసే బంగారు గాజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించారు. 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ నాగరాజు, బృందాన్ని అధికారులు అభినందించారు.

వ్యాధులను కట్టడి చేద్దాం

చిత్తూరు రూరల్: దోమలను అరికట్టి, వ్యాధులను కట్టడి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే..డ్రైడే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణం, నీటి నిల్వలను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. దోమలకు ఆవాసాలుగా ఉన్న నీటి కుంటలను తొలగించాలన్నారు. దోమల కట్టడికి ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. డీఎంఓ శ్రీనివాసులు, సిబ్బంది పీరుసాహెబ్ తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు: పట్టణంలోని ఎస్టీ కాలనీలో తాళం వేసిన ఇంట్లో బంగారు నగలను చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ కథనం .. ఈనెల 9న ఎస్టీ కాలనీకి చెందిన ప్రవీణ్, అత్త ధనమ్మ అనారోగ్యానికి గురైతే ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా వేలూరు సీఎంసీకి వెళ్లారు. మరుసటి రోజు వచ్చి చూడగా ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని పది గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు కనిపించ లేదు. చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో చోరీకి పాల్పడిన వారిని గుర్తించారు. ఈ సమాచారంతో పట్టణంలోని గుండుబావి వద్ద అనుమానంగా ఉన్న కొందరిని పట్టుకొని విచారించగా వారు చోరీని అంగీకరించారు. నిందితులు తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం తాలుకా కల్లూరుకు చెందిన జలీల్(49), వేలూరు జిల్లా అన్నెకట్‌కు చెందిన అహ్మద్‌బాషా(31), అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన షహీద్‌బాష(20)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి బంగారు చైనును స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు. నిందితులంతా కలసి పట్టణంలో పగటి పూట తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కేసును వేగంగా చేధించిన ఎస్ఐలు సుబ్బారెడ్డి, క్రైమ్‌పార్టీ సిబ్బందిని సీఐ చంద్రశేఖర్ అభినందించారు.

భార్య అలిగి వెళ్లిందని భర్త ఆత్మహత్య


చందు మృతదేహం

పూతలపట్టు: గ్రామంలో పనులు చేసుకుంటూ ఉంటామని చెప్పినందుకు భార్య అలిగి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు .. మండలంలోని తలపుల పల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన కె.వెంకట్రామయ్య కుమారుడు చందు(25) 4 ఏళ్ల కిందట మైసూరుకు చెందిన కె.నీల అనే యువతిని వివాహం చేసుకున్నాడు. పేటమిట్టలోని అమర్‌రాజా కంపెనీలో చందు పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నీలకు ఇక్కడి వాతావరణం నచ్చక పోవడంతో భర్తతో గొడవపడింది. అనంతరం ఇద్దరూ మైసూరుకు వెళ్లారు. రెండువారాల కిందట రెండవ కుమార్తెకు పుట్టువెంట్రుకల కార్యక్రమం కోసం కోసం ఇద్దరూ స్వగ్రామానికి వచ్చారు. తర్వాత భార్య మైసూరుకు బయలుదేరగా, చందు స్వగ్రామంలోనే పనులు చేసుకుంటూ, తల్లిదండ్రులను చూసుకుంటానని చెప్పాడు. అందుకు నీల ఒప్పుకోలేదు. ఇద్దరు పిల్లలను తీసుకుని మైసూరుకు వెళ్లిపోయింది. కొన్ని రోజులుగా వారిద్దరి మధ్య సంభాషణ ఫోన్‌లో మాత్రమే జరిగింది. గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు చందు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.